ప్రభుత్వ ఆస్పత్రికి కార్పొరేట్ లుక్

నాడు..
భీమిలిలోని సీహెచ్‌సీ భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు 30 పడకల ప్రధాన ఆస్పత్రిగా ఉండేది. కానీ వైద్యులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వైద్య సేవలు సరిగ్గా అందేవి కావు. భవనం దెబ్బ తినడంతో ఇన్‌పేషెంట్లు ఉండే పరిస్థితి ఉండేది కాదు.

నేడు
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. దీంతో ఇక్కడ రూ 3.28 కోట్లతో కొత్త ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తవడంతో, ఇటీవల అందుబాటులోకి వచ్చింది. వైద్యులతో పాటు, ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు గైనిక్, పీడియాట్రిక్, ఎనస్థీషియన్, సర్జన్, ఫ్యామిలీ ఫిజీషియన్‌తో పాటు, జనరల్ ఫిజీషియన్‌తో కలిపి పది మంది ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉన్నారు.

- భీమిలి సీహెచ్‌సీలో అత్యాధునిక వైద్య సదుపాయాలు
- రోగులకు మెరుగైన వైద్యసేవలు


ఇన్‌పేషెంట్ వార్డులో మంచాల పక్కన ఏర్పాటు చేసిన సెంట్రల్ ఆక్సిజన్ యూనిట్

భీమునిపట్నం: భీమిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోంది. ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని వసతులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక వసతులు

- ఇన్‌పేషెంట్స్ వార్డులో చక్కని సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రతీ మంచం పక్కన అత్యవసర రోగుల కోసం సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.
- ప్రమాదాలతో పాటు ఇతర అనారోగ్య పరిస్థితుల్లో వచ్చే రోగులకు ప్రాథమిక చికిత్స అందించేందుకు ప్రత్యేక విభాగం ఉంది.
- ప్రసూతి వార్డులో అత్యాధునిక సదుపాయాలను కల్పించారు. గర్భిణులకు సాధారణ ప్రసవాలతో పాటు, ఏదైనా సమస్య వస్తే, అత్యవసరమైతై సిజేరియన్ చేయడానికి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. దాని పక్కనే అప్పుడే పుట్టిన శిశువులను ఉంచడానికి న్యూ బార్న్ స్టెబిలైజేషన్ యూనిట్ ఉంది ఇక్కడ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.
- ఇన్‌పేషెంట్లకు టిఫిన్, భోజన సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి, గతంలో ఇది ఉండేది కాదు.

ఇలా కొత్త భవనంలో ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు, వైద్యులు అందుబాటులో ఉండడంతో అన్ని ప్రాంతాల నుంచి రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకు ఇక్కడి నుంచి విశాఖకు వెళ్లే పరిస్థితి తప్పింది. ఇప్పుడు చాలావరకు సమస్యలకు ఇక్కడే చికిత్సలు లభ్యమవడంతో ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.


అందుబాటులోకి వచ్చిన ఆస్పత్రి కొత్త భవనం

రూ 4.30 కోట్లతో కొత్త ప్రతిపాదనలు
రోగులకు మరిన్ని మెరుగైన సదుపాయాలు అందించడానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇందులో ప్రధాన ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే ప్లాంట్, ట్రాన్స్‌ఫార్మర్, ఆర్వో ప్లాంట్‌తో పాటు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి నిర్ణయించారు. ప్రభుత్వం దీన్ని మంజూరు చేసిన వెంటనే త్వరితగతిన పనులు పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తేనున్నారు.


ప్రసూతి వార్డు, పక్కనే నవజాత శిశువుల యూనిట్

ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ



ప్రత్యేక శ్రద్ధతో ఆస్పత్రి నిర్వహిస్తున్నాం. రోగులకు వైద్యులు నిత్యం అందుబాటులో ఉండడంతో సమస్య ఉండటం లేదు. ముఖ్యంగా అత్యవసర చికిత్సలతో పాటు రాత్రి వేళల్లో వచ్చే రోగుల విషయంలో వెంటనే స్పందించి వైద్య సేవలు అందిస్తున్నాం.
– డాక్టర్ సీహెచ్. కనకదుర్గ, ఆస్పత్రి ప్రధాన వైద్యురాలు

మంచి వైద్యం అందుతోంది



కొత్త ఆస్పత్రి భవనం, అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడంతో ఎంతో సదుపాయంగా ఉంది. ఇంతకు ముందు ఇంట్లో ఎవరికి అనారోగ్యం వచ్చినా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లవలసి వచ్చేది. ఖర్చు భరించడం కష్టంగా ఉండేది. ఇప్పుడు మంచి ఆస్పత్రి అందుబాటులోకి వచ్చింది. వెంటనే చికిత్స అందుతోంది – మేరుగు మణి, మంగమారిపేట

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సూరప్పడుకు పింఛన్ అందజేస్తున్న కిశోర్

పద్మనాభం: కిడ్నీ రోగికి ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించి ప్రశంసలందుకున్నారు వెల్ఫేర్ అసిస్టెంట్. మద్ది గ్రామానికి చెందిన కనకల సూరప్పడు కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ సంగివలసలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన కదలలేని పరిస్థితి ఉండడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ కిశోర్ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి రూ.10వేల పింఛన్‌ను అందించారు. దీంతో ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

పద్మనాభం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది పదో తరగతి విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం సొంత నిధులతో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. హెచ్ఎం ఎ.బాలామణి, ఆపస్ జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు కె.అక్కులు, ఎల్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనియత కేంద్రాల మాజీ సిబ్బంది సమావేశం రేపు

ఆనందపురం : గతంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పని చేసిన అనియత విద్యా కేంద్రాల బోధకులు, సూపర్‌వైజర్లతో ఈ నెల 5న విజయనగరం కోట వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు మహంతి రమణ ఓ ప్రకటనలో తెలిపారు. 2001లో ప్రభుత్వం అనియత విద్యా బోధకులను, సూపర్‌వైజర్లను తొలగించి కొంతమందికే ఉపాధి కల్పించారని, వేలాదిమంది అర్హులు ఇంకా ఉపాధికి నోచుకోలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బోధకులు, సూపర్‌వైజర్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న జి.ఎస్.ఎన్. రాజు తదితరులు

ఆనందపురం : శొంఠ్యాంలోని ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ జి.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ ప్రదర్శనలో ఉంచిన నమూనాలు భవిష్యత్తులో పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి, కొత్త అంశాలను కనుగొనేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మురుగదాస్, ఈసీఈ విభాగాధిపతి శివప్రసాద్, కార్యదర్శి ప్రసాదరాజు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు రాయుడు

పీఎం పాలెం: ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మరణించిన ఘటన పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి బాబా ఇంజినీరింగ్ కాలేజీకి వెళ్లే మార్గంలో ఉన్న శ్మశాన వాటికలో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నట్టు పోలీసులకు శుక్రవారం సాయంత్రం సమాచారం అందింది. ఈ మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా.. ఆ మృతదేహం శ్రీకాకుళం జిల్లా సీతంపేటకు చెందిన బిడ్డిక రాయుడు(31)గా గుర్తించారు. మృతుడి ఒంటి మీద ఎటువంటి గాయాలు లేవు. ఈయన స్థానికంగా నివాసం ఉంటూ పీఎం పాలెం పరిసరాల్లో వంట పనులకు వెళ్తుంటాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

తగరపువలస: ఇటీవల జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో హిందీ, తెలుగు భాషలలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు సమక్షంలో జరిగిన ఈ బహుమతుల ప్రదానోత్సవంలో భీమిలి జెడ్పీ బొడ్డేపల్లి రాము, నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ ప్రిన్సిపాల్ మాదాబత్తుల తిరుమల శ్రీదేవి, డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు, ప్రొఫెసర్ జి.ఎల్.ఎన్.రాజు పాల్గొన్నారు.

- తెలుగు వ్యాసరచన పోటీల్లో అగ్నిహోత్రం వి.ఎస్.ప్రణీత, ఎం.సాయిపూర్ణ, ఎం.ధనుష్, తెలుగు ఉపన్యాస పోటీల్లో పి.ధనుష్, జి.యక్షిణి, డి.సౌజన్య మొదటి మూడు బహుమతులు సాధించగా, హిందీ భాషలో జరిగిన వ్యాస రచన పోటీల్లో గేదెల మోహనసాయిలక్ష్మి, ఎర్నింటి సౌమ్యశ్రీ, కాళ్ల జోషితా హాసిని, హిందీ ఉపన్యాస పోటీల్లో గేదెల తరుణ్ చైతన్యరెడ్డి, మాదాబత్తుల మోనిక, షేక్‌ఖాను మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

మహిళా చైతన్యంపై వాక్‌థాన్


వాక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

కొమ్మాది: ఈ ఏడాది నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గీతంలో ముందుగానే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మహిళా చైతన్యంపై శుక్రవారం వాక్‌థాన్ నిర్వహించారు. గీతం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఈ వాక్‌థాన్‌ను గీతం అధ్యక్షుడు ఎం. శ్రీ భరత్ ప్రారంభించారు.

నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు


శివలింగాన్ని ప్రతిష్టిస్తున్న పండితులు

ఆనందపురం: పెద్దిపాలెం గ్రామానికి సమీపంలోని చిట్టీల అగ్రహారంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఆయల సోమయాజుల నరేష్ శర్మ, లక్ష్మి దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఆస్థాన పండితులు మహాగణపతి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, నవగ్రహ శిఖర, ధ్వజ స్తంభ, పంచరాత్ర ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో శివలింగం, నందిని ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం సుమారు మూడు వేల మందికి అన్నదానం చేశారు.

నూకాలమ్మ ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎల్లాజీరావు

భీమునిపట్నం: ఈనెల 20వ తేదీ నుంచి 23 వరకు జరగబోయే భీమిలి గ్రామ దేవత నూకాలమ్మవారి ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీరావు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తెలిపారు. 8వ తేదీన అమ్మవారి ఉత్సవ చాటింపు వేడుక జరుగుతుందన్నారు. ఆ రోజు పెద్ద ఎత్తున ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. అమ్మవారి మాల ధరించాలనుకునే భక్తులు ఉత్సవాల లోపు మాలధారులు కావాలన్నారు. 23 నుంచి మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రధాన కార్యదర్శి రాంభక్త ప్రభాకర్‌నాయుడు, కోశాధికారి కాసరపు ఎల్లాజి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నమ్మి శేషాద్రి యాదవ్, కోఆర్డినేటర్ ముమ్మిడిశెట్టి సునీల్ పాల్గొన్నారు.

వన్య ప్రాణులను సంరక్షించుకుందాం



వన్య ప్రాణులను సంరక్షించాలని కోరుతూ ర్యాలీ చేస్తున్న పద్మనాభం విద్యార్థులు

తగరపువలస: ప్రపంచంలో అంతరించిపోతున్న వన్య ప్రాణులను సంరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు కోరారు.

శుక్రవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా అడవి జాతుల సంరక్షణ గురించి విద్యార్థులకు వివరించారు. 1972లో భారతదేశంలో వన్యప్రాణుల సంరక్షణకు చట్టం చేశారన్నారు. అలాగే ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా మెరుగైన సమాజం కోసం ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు.

పద్మనాభంలో..
పద్మనాభం: వన్య ప్రాణులను సంరక్షించుకోవాలని కోరుతూ పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వాటిని సంహరించడం నేరమని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎ.బాలామణి, ఉపాధ్యాయులు డి.సత్యనారాయణ, పద్మావతి, సమీమ్ మున్నీషా, అక్కులు పాల్గొన్నారు.

రేకుల ఇంటిపై నుంచి జారిపడి ఆవు మృతి


ఇంట్లో పరుపుపై పడి మృతి చెందిన ఆవు

తగరపువలస : భీమిలి జోన్ ఒకటో వార్డు చిట్టివలస సాంఘిక సాంక్షేమ బాలికల వసతిగృహం వెనుక మేడిసి భాస్కరరావుకు చెందిన రేకుల ఇంటి మీద జారి పడి ఆవు మృతి చెందింది. బాధితుడు భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం వీరు నివసిస్తున్న రేకుల ఇంటిని ఆనుకుని కొత్తగా నిర్మించిన డాబా ఉంది. కొండవాలు నుంచి డాబాపైకి చేరుకున్న ఆవు రేకుల ఇంటిపై అంగన్‌వాడీల ద్వారా సరఫరా అయ్యే బాలామృతం ప్యాకెట్ చూసి తినడానికి ఒక్కసారిగా గెంతింది. ఆవు బరువుకు రేకులు పగిలిపోయి ఇంట్లో నేలపై ఉన్న పరుపుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆవు కాళ్లు విరిగిపోయి కదలలేని స్థితిలో మృత్యువాత పడింది. ఇంట్లో ఆవు పడిన పరుపుపై భాస్కరరావు తండ్రి సాధూరావు నిద్రిస్తుంటాడు. సెక్యూరిటీ గార్డుగా పనిచేసే ఆయన అదృష్టవశాత్తూ డ్యూటీకి వెళ్లిపోవడంతో ప్రాణనష్టం తప్పింది. కూలిపనులు చేసుకునే తాము అతికష్టం మీద రేకుల ఇంట్లో ఉంటున్నామని అది శిథిలం కావడంతో రేకులు మొత్తం మార్చవలసి వస్తుందని భాస్కరరావు వాపోయాడు. దాతలు సహకరించాలని.. పశువులు ఇళ్లపైకి చేరకుండా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరాడు.

విదేశీ వర్సిటీ నిపుణుల గీతం సందర్శన

కొమ్మాది: గీతంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తూ అమెరికాలో గల లూయిస్ విల్లె విశ్వవిద్యాలయం ప్రతినిధులుశుక్రవారం గీతం కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, పరిశోధన, కాన్‌సెంటర్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ మహేంద్ర సుంకర గీతం అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తమ ప్రయోగశాలలో అభివృద్ధి చేసిన కృత్రిమ వజ్రాలు, వివిధ కోర్సుల గురించి వివరించారు.

మాధవ్‌కు మద్దతుగా బీజేపీ ప్రచారం

మధురవాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో బరిలో నిల్చున్న పీవీఎన్ మాధవ్ తరపున మధురవాడలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీఎస్ దిలీప్‌వర్మ శుక్రవారం ప్రచారం చేశారు. ఎస్‌బీఐ, సెంట్రల్ బ్యాంకు, కర్ణాటక తదితర బ్యాంకుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి పోతిన పైడిరాజు, కార్యదర్శి పోతిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి సుధాకర్ గెలుపు తప్పనిసరి


సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల వద్ద ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం: ఉత్తరాంధ్రతో పాటు విశాఖ ప్రాంతం అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఇక్కడ తన క్యాంపు కార్యాలయంలో 2, 3 వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు, పెన్షనర్ల అసోసియేషన్, వాణిజ్య తదితర సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో గుర్తింపు, భవిష్యత్తు ఉన్న విశాఖను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన రాజధానిగా ప్రకటించడం మనందరి అదృష్టమన్నారు. అటువంటి ప్రాంతానికి సుధాకర్ ఎమ్మెల్సీగా ఎన్నికైతే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిలో ఆయన పాత్ర కూడా చాలా ఉంటుందని చెప్పారు. విశాఖలో పారిశ్రామిక దిగ్గజాలతో జరుగుతున్న పెట్టుబడుల సదస్సులో రూ.లక్షల కోట్లతో పరిశ్రమలు, కంపెనీలు పెట్టడానికి ముందుకు వచ్చారని, ఈ ఘనత మొత్తం సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అనంతరం సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలతో పాటు పలు విద్యా సంస్థల ఉపాధ్యాయులు, సిబ్బందిని కలిసి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, పార్టీ 2, 3 వార్డుల ఇన్‌చార్జిలు ఎస్.కరుణాకరరెడ్డి, మైలిపల్లి షణ్ముఖరావు పాల్గొన్నారు.

మధురవాడ: బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్, పరిసర ప్రాంతాలలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సందీప్, వైస్ ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, వాండ్రాసి రవికుమార్, రాయిన సాయి, గుంటబోయిన సంజీవ్ యాదవ్ పాల్గొన్నారు.

తగరపువలస: వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సుధాకర్ తరపున శుక్రవారం శిష్టకరణాల రాష్ట్ర సంఘం ప్రతినిధులు చిట్టివలస, తగరపువలసలలో ప్రచారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, రాష్ట్ర నాయకుడు అరికతోట చంద్రమౌళి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దత్తి ఈశ్వరరావు, తదితరులు సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, చిట్టివలస శ్రీరామకృష్ణ విద్యాలయం తదితర చోట్ల పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు.


సుధాకర్ తరపున సంతపేట అంబేద్కర్ పాఠశాలలో ప్రచారం చేస్తున్న శిష్టకరణాల రాష్ట్ర ప్రతినిధులు

బడ్జెట్‌లో కేటాయింపులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ రామకృష్ణారావు

భీమునిపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో దేనికి ఎంత కేటాయింపులు జరిగాయన్న అంశాలను విద్యార్థులు తెలుసుకోవాలని ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగ విశ్రాంత ప్రొఫెసర్ బి.రామకృష్ణారావు సూచించారు. 'కేంద్ర బడ్జెట్, భారతదేశ స్థితిగతులు' అంశంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంది, రాబడులు, పెట్టుబడులు ఏవిధంగా ఉంటాయనే అంశాలను వివరించారు. ప్రధానంగా రక్షణ రంగం, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు తదితర కార్యకలాపాలకు అవసరమైన నిధులను కేటాయిస్తారని తెలిపారు. ఇలా బడ్జెట్ కేటాయింపులు, వాటి ద్వారా జరిగే పనుల గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ప్రతి విద్యార్థికి ఉందన్నారు. దీనివల్ల దేశ పాలన, ప్రజలకు ఎటువంటి సదుపాయాలు అందుతున్నాయి అనేవాటితో పాటు ఇతర విషయాలు తెలుస్తాయన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


కంపా ఎల్మాజీ(ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ వేమలవారి కళ్లాలకు చెందిన కంపా ఎల్మాజీ అనే వివాహిత గురువారం సాయంత్రం నుంచి కనిపించడం లేదు. దీనిపై భీమిలి పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలివి.. తాటితూరు పంచాయతీకి చెందిన లక్ష్మీకొండ, సంధ్య అనే మహిళలతో ఎల్మాజీ గురువారం తగరపువలస వచ్చింది.

బట్టల షాపింగ్ అనంతరం మిగిలిన ఇద్దరు మహిళలు పెళ్లికార్డుల పంపిణీకి చిప్పాడ వెళ్లిపోగా.. సాయంత్రం వరకు ఎల్మాజీ ఇంటికి చేరలేదు. ఎల్మాజీ భర్త వీరభద్రరావు సాయంత్రం ఆమెకు ఫోన్ చేయగా ఒకసారి రింగ్ అయి ఆగిపోయింది. దీంతో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా, హెడ్ కానిస్టేబుల్ జి.సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 50 వేల విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాత సుగుణ రామారావు

ఆనందపురం: స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని శ్రీదుర్గాభవాని ఆలయ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు షిణగం సుగుణ రామారావు రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అమ్మవారి ఆలయ అభివృద్ధికి అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు.